క్లుప్తంగా

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో ఆదివారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన పది మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను మంజూరు చేయించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను అందజేశారు. సొసైటీ చైర్మన్ సోమ హేమంత్ రెడ్డి, ఎంపీటీసీ సామెర సురేష్, పాలకవర్గ సభ్యులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విశారదన్ సభకు విరాళం

బాల్కొండ: బహుజనులు రాజ్యాధికారం సాధించాలంటూ గతేడాది మార్చి నుంచి ఏడాది కాలం పాటు పదివేల కిలోమీటర్ల పాదయాత్ర చేసిన విశారదన్ మహరాజ్ ఆదివారం చేపడుతున్న ముగింపు సమావేశానికి మండలంలోని ఇత్వార్‌పేట్‌కు చెందిన లింగన్న రూ.10 వేలను విరాళంగా డీఎస్పీ నాయకులకు అందజేశారు. పాదయాత్ర చేపట్టి బహుజనుల కష్టాలను తెలుసుకున్న విశారదన్ మహరాజ్‌కు అండగా నిలవాలన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



నవీపేట: మోకన్‌పల్లి గ్రామానికి చెందిన పోశెట్టి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పైడి రాకేశ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి, పైడి రాకేశ్ రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు సురేశ్, సంతోష్‌లు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



కమ్మర్‌పల్లి: నాగాపూర్‌లో డాకూరి రాజేశ్వర్ ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్‌ను ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. స్థానిక నేతలు నర్సయ్య, గణేష్, కిషన్ పాల్గొన్నారు.

'మలేరియా'పై అవగాహన

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే కాలనీలో ఆదివారం మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవిత మాట్లాడుతూ.. జ్వరం వచ్చినా, వాంతులు, కడుపునొప్పి ఉన్నా దగ్గరలోని డాక్టర్‌ను సంప్రదించి టెస్ట్ చేసుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ.. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటిని నిల్వ చేసుకోవద్దన్నారు. అంతేకాకుండా దోమ తెరలను అందరూ తప్పకవాడాలన్నారు.

'దళిత బంధు'లో అవినీతిని బహిర్గతం చేయాలి



నిజామాబాద్‌నాగారం: దళిత బంధు పథకంలో జరిగిన అవినీతిని బహిర్గతం చేయాలని, అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలను తక్షణమే బర్తరఫ్ చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పులాంగ్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ప్లీనరీ సభలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేలు దళిత బంధు పథకంలో కమీషన్లు తీసుకున్నట్లు తెలిసిందని వ్యాఖ్యానించారని, దీనిపై గవర్నర్ స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు గంధమాల నాగభూషణం, ప్రమోద్, యమున, సంతోష్, శ్రీరాములు పాల్గొన్నారు.

తేమ పేరుతో ఇబ్బందులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బంది తేమ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఆదివారం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. కేంద్రం ఇన్‌చార్జి రవీందర్ రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. వరి ధాన్యం కాంటా వేయాలంటే తేమ శాతం 17 శాతం ఉండాలని చెబుతూనే తన వద్దకు మాత్రం తేమ శాతం 34 వచ్చినా కాంటా వేసుకుని ధాన్యాన్ని సంచుల్లో నింపాడని ఆరోపించారు. ఈ విషయాన్ని సొసైటీ సీఈవో కిషన్‌కు సమాచారం ఇవ్వగా ఆయన వచ్చి సిబ్బంది రవీందర్‌కు వత్తాసు పలుకడం శోచనీయమన్నారు.

కోతుల బెడద

- మారంపల్లిలో ఇళ్లపై దాడులు చేస్తున్న వానరాలు
- ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్న వైనం
- ఫారెస్టు అధికారులు స్పందించాలని కోరుతున్న గ్రామస్తులు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలోని మారంపల్లిలో కోతుల బెడద ఎక్కువైంది. వానర దండు గుంపుగా వచ్చి ఇళ్లపై దాడి చేస్తున్నాయి. పెంకుటిళ్లపై పెంకులను తొలగించి నష్టపరుస్తున్నాయి. ఇళ్లలోకి వచ్చి ఆహార పదార్థాలు లాక్కెళ్తున్నాయని, చాలాసార్లు పిల్లలపై దాడి చేసి గాయపరిచాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కోతులు ఊరిలోకి వస్తే భయమేస్తుందని, ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. చాలా రోజులుగా వానరాలతో ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అయితే, గ్రామ పంచాయతీ వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇటువైపు రావాలంటే జంకుతున్నారు. ఫారెస్టు అధికారులు ఇప్పటికైనా స్పందించి కోతులను పట్టుకుని అటవీ ప్రాంతాల్లో వదలి, గ్రామాన్ని కోతుల బారినుంచి కాపాడాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గ్రామంలో కోతుల బెడద తీవ్రత విషయాన్ని ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీటి వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపడతాం. – అర్గుల రవి, ఉప సర్పంచ్



మారంపల్లిలో సంచరిస్తున్న కోతులు

వినూత్నంగా నిరసన తెలిపిన వీవోఏలు



బాల్కొండ ఐకేపీ వద్ద నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న వీవోఏలు



ముప్కాల్‌లో ..

తమ డిమాండ్ల సాధన కోసం ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 7వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా వీవోఏలు రోజుకో రీతిన నిరసన తెలుపుతున్నారు. ఆదివారం ఐకేపీ కార్యాలయాల వద్ద వీవోఏలు తమ నోటికి గుడ్డలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కమ్మర్‌పల్లిలో..



నవీపేటలో సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం

రుద్రూర్: కోటగిరిని బస్టాండ్ ఆవరణలో సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు దళిత సంఘాల ఆధ్వర్యంలో నాయకులు పాలాభిషేకం చేశారు. తెలంగాణ సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంగా నామకరణం చేసినందుకు వారికి దళిత నేతలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న, కాలే సాయిలు, బ్యాగరి రాములు, ఉప్పల సైదయ్య, జంగం సాయిలు, పాల గంగారం, ఎంఆర్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న దళిత నేతలు

తడిసిన ధాన్యం పరిశీలన

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి, రాణంపల్లి శివారుల్లో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆదివారం జెడ్పీటీసీ నరోజి గంగారాం, రైతు బంధు మండల కన్వీనర్ తోట సంగయ్య పరిశీలించారు. రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యం కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జెడ్పీటీసీ గంగారాం స్థానిక రైస్‌మిల్లు యాజమానితో మాట్లాడి ధాన్యాన్ని త్వరగా తీసుకోవాలని కోరారు. వారితో రాయకుర్ సొసైటీ అధ్యక్షులు సంగమేశ్వర రావ్, రుద్రూర్ విండో మాజీ చైర్మన్ పత్తి రాము, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నేరుగంటి బాలరాజు, తదితరులు ఉన్నారు.



చిక్కడపల్లి శివారులో పరిశీలిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

ప్రధానిగా మోదీ ఉండటం అదృష్టం

సుభాష్‌నగర్: భారతదేశానికి ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండటం మనందరి అదృష్టమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో కార్యాలయంలో ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల ఇబ్బందులు తెలుసుకునేందుకు మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పేదల కోసం ప్రధాని మోదీ ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. అంతేగాకుండా ఉజ్వల యోజన, జన్ ధన్ యోజన, త్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370 రద్దు, ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. 100వ ఎపిసోడ్ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఎన్నో విషయాలను ప్రజలకు వివరించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వెంకటరమణ, నాయకులు సత్యప్రసాద్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, లాభిశెట్టి శ్రీనివాస్, పుర ప్రముఖులు, డివిజన్‌వాసులు పాల్గొన్నారు.



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నేత ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

భారతీయుల మనస్సుతో ముడిపడిన మన్‌కీబాత్

మన్ కీ బాత్ కార్యక్రమం ప్రజల మనస్సును కట్టిపడేసిందని, అంతరించి పోతున్న రేడియో వ్యవస్థకు ఊపిరిపోశారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నాగారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. నాయకులు కోడూరు నాగరాజు, యెండల సుధాకర్, ఆది నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతు పనులు ప్రారంభం



బాల్కొండ: మండల కేంద్రంలోని సాయికుంట చెరువు, అలీం చెరువుల మరమ్మతు పనులను ఆదివారం ప్రారంభించారు. రెండు చెరువుల మరమ్మతుల కోసం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపి రూ.29.30 లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు వర్షాకాలం సీజన్ ప్రారంభమయ్యే నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, విద్యాసాగర్, నరహరి, పోశెట్టి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ వాహనాలపై పోలీసుల కొరడా



కమ్మర్‌పల్లి: నిబంధనలను అతిక్రమించి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై పోలీసులు కొరడా ఝులిపించారు. కమ్మర్‌పల్లిలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలో భాగంగా ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలను ఆపి జరిమానా విధించారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న చోదకులపై కేసులు నమోదు చేశారు. మొత్తం 20 కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

బాద్‌షా షరీఫ్ దర్గా ఉత్సవాలు



బాల్కొండ: మండల కేంద్రంలోని హజరత్ సయ్యద్ అబుల్ ఫత్తే బందగి బాద్‌షా షరీఫ్ దర్గా ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మదర్సా పాఠశాల నుంచి దర్గా వరకు డప్పు వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. దర్గా షరీఫ్‌కు సందల్(గంధం) సమర్పించారు. షరీఫ్ దర్గా ముతవల్లి రియాజ్ ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీలో ఫకీరుల విన్యాసాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. అలాగే దర్గా వద్ద మెగా వైద్య శిబిరం కూడా నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శిగా మాయవార్ రాజేశ్వర్



నిజామాబాద్‌నాగారం: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన మాయవార్ రాజేశ్వర్‌ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి ఇచ్చినందుకు ఆర్ కృష్ణయ్యకు, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కుల మతాలకు అతీతంగా కలిసి ఉండాలి

ఆర్మూర్: హిందూ, ముస్లింలు కుల మతాలకు అతీతంగా కలిసి మెలిసి ఉండాలని బీఆర్ఎస్ నాయకుడు ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి కోరారు. ఆర్మూర్‌లోని సైదాబాద్ కాలనీ ఉర్దూ ఘర్‌లో జమాతే ఇస్లామి హింద్ (జేఐహెచ్) ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వెలుగు ఉపన్యాసకుడు గౌసుద్ అహ్మద్ రంజాన్ మాసం విశిష్టత గురించి వివరించారు. అంకాపూర్ లాలన వృద్ధాశ్రమం నిర్వాహకులు గడ్డం రాజిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ గంట సదానందం, ఎస్ఎస్‌కే సమాజ్ ఆర్మూర్ అధ్యక్షుడు ప్రకాష్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత రాజేశ్వర్‌రెడ్డి

ఆధ్యాత్మికం..

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు



బాల్కొండలో పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు



పడగల్‌లో..

వేల్పూర్:పడగల్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరివీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి జరిగి నేటికి 300 సంవత్సరాలు పూర్తికావడంతో బ్రహ్మంగారి ఆలయంలో మంగళహారతులతో పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. అన్నదానం నిర్వహించారు.

బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



రెంజల్(బోధన్): ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను ఆదివారం రెంజల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ముందుగా కన్యకాపరమేశ్వరి చిత్రపటానికి ప్రత్యేకంగా దూపదీపాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. నైవేద్యాలను సమర్పించారు. శివకుమార్, దినేష్, బాలయ్య, రాజులు సేట్, రాజు పాల్గొన్నారు.



పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



రుద్రూర్: అక్బర్ నగర్‌లో పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిపారు. వరి పరిశోధన కేంద్రం అధిపతి బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం వేద బ్రాహ్మణులు కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక సర్పంచ్ తిగుళ్ల గంగామణి ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పోలవరపు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కర క్షేత్రంలోని సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం భక్తులతో పూజలు, యజ్ఞ కార్యక్రమాలు చేయించారు. వారం రోజుల పాటు పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞ కార్యక్రమాన్ని ఆశ్రమంలో నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠాపన చేయనున్నారు. రెంజల్, ఎడపల్లి, బోధన్, నవీపేట్ మండలాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నిమిషాంబ దేవి అవతరణ దినోత్సవం



ముప్కాల్‌లో కన్యకాపరమేశ్వరి విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

బాల్కొండ: మండల కేంద్రంలో నిమిషాంబ దేవి ఆలయంలో ఆదివారం ఘనంగా నిమిషాంబ దేవి అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారికి ఆభరణాలను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ముప్కాల్ మండల కేంద్రంలో..

ముప్కాల్ మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం కన్యకా పరమేశ్వరి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బాల్కొండ: ఆలయంలో యజ్ఞం చేస్తున్న భక్తులు

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలి

రెంజల్(బోధన్): అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ రాజలింగం ఆదివారం తెలిపారు. విద్యుత్ స్తంభాల వద్ద, వైర్ల కింద నిలబడొద్దని, తెగిపడిని విద్యుత్ పరికరాలను ముట్టకోవద్దని, ఇంట్లో, పంట పొలాల వద్ద తడి చేతులతో స్విచ్ బోర్డులు తాకవద్దని, రైతులు బోర్ల వద్ద స్టాటర్లను తడి చేతులతో పట్టుకో వద్దని, తీగలు అతుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు అనధికారికంగా విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయవద్దన్నారు. విద్యుత్ సమస్యలు న్నట్లు గుర్తిస్తే సొంతంగా వాటి వద్దకు వెళ్ల కుండా సిబ్బందికి సమాచారమివ్వాలని ఏఈ వివరించారు.

మేడే స్ఫూర్తితో హక్కులను సాధించుకుందాం



ఆర్మూర్ పట్టణంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దాసు, ఇతర నాయకులు

– ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసు

ఆర్మూర్: మేడే స్ఫూర్తితో పోరాడి గ్రామ పంచాయతీ కార్మికుల హక్కులను సాధించుకుందామని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దాసు పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణం ఆదర్శనగర్ కాలనీలో గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్మికులంతా 137వ మేడేను ఘనంగా నిర్వహించాలని కోరారు. అనంతరం మేడే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జరంకి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జేపీ గంగాధర్, భానుచందర్, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

తెలంగాణ సచివాలయ నమూనా ఏర్పాటు



మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తొర్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ సచివాలయం నమూనాను ఏర్పాటు చేశారు. రాష్ట్ర సచివాలయం నమూనా చిత్రపటాన్ని ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంటోంది. అటు వైపుగా వెళ్లే వారందరూ ఆసక్తిగా దానిని తిలకిస్తున్నారు.